ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 16 జనవరి 2025



హోం మంత్రి పరమేశ్వర్ అసంతృప్తి

బెంగళూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఏఐసీసీ కార్యాలయం ఇందిరాగాంధీ భవన్ ప్రారంభానికి ఆహ్వాన పత్రిక అందకపోవడంతో హోం మంత్రి పరమేశ్వర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లకు మాత్రమే ఆహ్వానపత్రికలు అందాయి. పరమేశ్వర్‌కు ఆహ్వానపత్రికకు అందకపోవడంపై అసంతృప్తితో ఉన్నారు. బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ... ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీతో భేటీ కావాల్సి ఉండేదని, వారు బిజీగా ఉన్నారనే కారణంతో ఢిల్లీ వెళ్లడం లేదన్నారు.

భక్తజన సందోహం.. గవి సిద్దేశ్వరం..!



అశేష భక్తజనసందోహం నడుమ సాగుతున్న గవిసిద్ధేశ్వర బ్రహ్మరథం

- వైభవంగా రథోత్సవం
- దేశవిదేశాల నుంచి భక్తుల రాక

బళ్లారి గాంధీనగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో కుంభమేళగా పిలవబడుతున్న కొప్పళ సుప్రసిద్ధ గవిసిద్దేశ్వర బ్రహ్మరథోత్సవం బుధవారం సాయంత్రం అరంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ప్రముఖ హిందూస్తానీ గాయకులు ఎం.వెంకటేష్ కుమార్ రథాన్ని ప్రారంభించారు. అశేష భక్తజనసాగర నడుమ గవిసిద్దేశర బ్రహ్మరథం ముందుకు సాగుతుండగా... భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. రథంపై భక్తులు కర్జూరపు పండ్లు, అరటిపళ్లు విసురుతూ తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. బుధవారం ఉదయం నుంచి గవిమఠంలో ఉన్న 11వ పీఠాధిపతులకు విశేష పూజలు నిర్వహించారు. జాతర మహోత్సవాన్ని తిలకించడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. జాతర అంటే కేవలం భక్తికి మాత్రమే పరిమితం కాకుండా ప్రజల్లో అన్నదాసోహ, అక్షర దాసోహం, పరిసర కాళజి, రక్తదానం, జలదీక్ష.. ఇలా అద్భుతమైన సామాజిక ఆందోళన, ఉద్దేశాలతో ప్రతి ఏటా సత్కార్యాలను చేస్తూ వస్తున్న గవిమఠం మరో విశేషం. బ్రహ్మరథోత్సవాన్ని పురస్కరించుకుని 15 రోజులపాటు మహా దాసోహ కార్యక్రమాన్ని చేస్తున్నారు. ఈ ఏడాది జాతర మొదటి రోజున భక్తులకు బెల్లంతో తయారు చేసిన జిలేబీని అందజేస్తారు. ఈ వంటకాలను మహాదాసోహ కార్యక్రమానికి నెల రోజుల క్రితం నుంచే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు హోళిగి, నెయ్యి, రొట్టెలు, తయారుచేసి గవిమఠానికి అందజేయడం ప్రత్యేకత. యువకులకు క్రీడాపోటీలు నిర్వహించారు. జాతరలో మారథాన్‌తో పాటు మరికొన్ని దేశీయ క్రీడలను ఏర్పాటు చేశారు. వీటిలో మల్లకంబ, ముంగై కుస్తి, కబడ్డీ, గుండు ఎత్తే పోటీలతో పాటు వివిధ క్రీడాపోటీలను శ్రీమఠం ఆవరణలో నిర్వహించారు. మహిళల కోసం ప్రత్యేకంగా రంగోలి పోటీలు నిర్వహించారు. ఈసారి జరిగిన బ్రహ్మరథోత్సవానికి 8 లక్షల మందికి పైగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. మహారథోత్సవాన్ని పురస్కరించుని కొప్పళ జిల్లా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలతోపాటు 9 మంది డీఎస్పీలు, 35 మంది సీఐలతో పాటు 1600 మంది పోలీసులతో బందోబస్తు పర్యవేక్షించారు.



అలంకరణలో గవిసిద్దేశ్వరుడు



స్వామివారిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు



భక్తులకు సూచనలిస్తున్న మఠాధీశుడు



రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

కులగణన సమాచారం.. బహిర్గతం..!

- రెండోసారి గణాంకాలు లీక్
- నేడు కేబినెట్ ముందుకు నివేదిక



బెంగళూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ కులానికి చెందినవారు ఎంత మంది? ఏఏ స్థాయిలో ఉన్నారు? వారిలో విద్యావంతులు, ఉద్యోగుల వివరాలతోపాటు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని గుర్తించేలా సాగిన కులగణన సమాచారం బయటపడింది. కులగణన నివేదికలు ఎట్టి పరిస్థితుల్లోనూ బహిరంగం చేయరాదని వీరశైవ లింగాయత సామాజికవర్గం తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కానీ బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలు మాత్రం కులగణన సర్వే జరిగి ఏళ్లు గడుస్తున్నా ఎందుకు బహిరంగం చేయరంటూ డిమాండ్ చేస్తున్నాయి. గత కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం కొనసాగిన 2018-19మధ్యనే నివేదిక విడుదల కానుందని ప్రచారం సాగింది. ఆ తర్వాత మూన్నరేళ్లపాటు పాలన సాగించిన బీజేపీ ప్రస్తావించలేదు. కులగణన సర్వే జరిపించిన సిద్దరామయ్య రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఏడాదిన్నర ముగిసిన తర్వాత నివేదిక అంశం మరోసారి తెరపైకి వచ్చింది. గడిచిన మూడు నాలుగు నెలలుగా కులగణన నివేదికను కేబినెట్‌లో చర్చించి ఆమోదిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అందుకు పలు కులసామాజిక సంఘాలు అభ్యంతరం తెలుపుతూ వచ్చాయి. ఇలా అనుకూల, వ్యతిరేకత వ్యక్తం అవుతున్న తరుణంలోనే సామాజిక, విద్యా సమీక్ష (కులగణన) నివేదిక గురువారం (జనవరి 16)న మంత్రివర్గం ముందుకు రానుంది. కేబినెట్‌లో చర్చకు ముందే గణాంకాలు లీక్ అయినట్టు మంగళవారం నుంచి కథనాలు హల్‌చల్ చేస్తున్నాయి. సమగ్రంగా వివరాలు బహిరంగపరచకపోయినా కులాల ప్రకారం ఎన్ని లక్షలమందిలో ఉన్నారనేది సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు కులగణన నివేదికను ప్రభుత్వం సేకరించి వాటికి అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ అగ్రవర్ణాలైన లింగాయత, ఒక్కలిగ సామాజికవర్గానికి చెందినవారు సర్వే శాస్త్రీయబద్ధంగా జరగలేదని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం నివేదికను స్వీకరించరాదని డిమాండ్ చేస్తున్నారు.

- 2024 ఫిబ్రవరిలో బీసీ కమిషన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న జయప్రకాశ్ హెగ్డే కులగణన నివేదికను సీఎం సిద్ధరామయ్యకు సమర్పించారు. తద్వారా కులగణన నివేదిక అంతిమంగా ప్రభుత్వం స్వీకరించినట్టయ్యింది. సదరు నివేదికకు ఆమోదం తెలిపి బహిరంగం చేయాల్సి ఉంది.

ఊహాజనిత విమర్శలు సరికాదు : సీఎం

కులగణన గణాంకాలు ఇంకా బహిరంగం కాలేదని ఊహాజనితంగా విమర్శలు సరికాదని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ భవనం ప్రారంభంలో పాల్గొనేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి బుధవారం మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గంలో స్వీకరించాల్సి ఉందన్నారు. ఈ వారం కాకుండా రానున్న కేబినెట్ భేటీలో విషయాన్ని ప్రస్తావించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.


2013-18 మధ్య కాలంలో సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో ప్రభుత్వం హెచ్ కాంతరాజ్ అధ్యక్షతన బీసీ వర్గాల కమిషన్ ద్వారా సామాజిక, విద్యా సమీక్షను 2015లో చేపట్టింది. రాష్ట్రమంతటా ఇంటింటా గణాంకాలు సేకరించారు. ఆ తర్వాత నివేదిక సిద్ధమైనా పలు కారణాలతో ప్రభుత్వం స్వీకరించలేదు. కానీ పలు సందర్భాలలో నివేదికలోని అంశాలు బహిరంగమైనా రాష్ట్ర రాజకీయాల్లో సంచనాలకు కారణమయ్యాయి.

- రాష్ట్రంలో ఎస్సీ సామాజికవర్గం తర్వాత ముస్లిం వర్గాలే అత్యధికంగా ఉన్నారనే గణాంకాల నివేదిక లీక్ అయి వివాదాలు సృష్టించింది. అందుకు ఒక్కలిగ, లింగాయత సామాజికవర్గాలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ శాస్త్రీయబద్ధంగా అమలుకాని సర్వేలను ప్రభుత్వం స్వీకరించరాదని డిమాండ్ చేశారు. వీరశైవలింగాయత సామాజికవర్గాలకు చెందిన స్వామీజీలు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఏకంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వారం రోజుల్లోనే కులగణన సర్వే బహిరంగమవుతుందనే సమాచారంతో ఒక్కలిగ సామాజికవర్గానికి చెందినవారు సంక్రాంతి వేళ తీవ్రమైన నిరసనలు చేపట్టాలని సిద్ధమయ్యారు. డీసీఎం డీకే శివకుమార్ కొన్నిరోజులు ఓపికపట్టాలని కోరారు.
- 2023లో సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2024 ఫిబ్రవరిలో బీసీ కమిషన్ ఛైర్మన్ హోదాలో జయప్రకాశ్ హెగ్డే నివేదికను సమర్పించారు. అప్పటినుంచి పలు సందర్భాలలో సీఎంను బీసీ సంఘాలు నివేదిక స్వీకరించాలని పట్టుబట్టాయి. కానీ పలు కారణాలతో వాయిదాలు వేస్తూ వస్తున్నారు. మంత్రివర్గ భేటీలో నివేదికక ఆమోదిస్తారని కొన్ని కులాలు వ్యతిరేకిస్తుండగా మరికొంతమంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కేబినెట్ భేటీలో ఏ విధమైన చర్చలు సాగుతాయి, మంత్రులంతా అంగీకరిస్తారా. లేదా కేబినెట్‌లోనూ కీలకమైన ఒక్కలిగ, లింగాయత మంత్రులుగా కొనసాగుతున్నవారు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సిందే. 2011 కులగణన ప్రకారం రాష్ట్ర జనాభా 6.30 కోట్లుగా ఉంది.
- తాజాగా వైరల్ అయిన కులగణాంకాలు ఇలా ఉన్నాయి. లక్షల్లో మాత్రమే గణాంకాలు లీక్ అయ్యాయి. మరికొన్ని కులాల వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

గుట్టుచప్పుడు కాకుండా ఆపరేషన్ హస్త

- జేడీఎస్‌ను దెబ్బతీసే యత్నం..?

బెంగళూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్-జేడీఎస్‌ల మధ్య మాటలయుద్ధం కొనసాగుతున్న తరుణంలోనే రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ భారీ వ్యూహమే పన్నినట్టు తెలుస్తోంది. ఏకంగా జేడీఎస్ పార్టీని కోలుకోలేని దెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నారని గడిచిన నెలరోజులుగా చర్చలు సాగుతున్నాయి. ఈ తరుణంలోనే సంక్రాంతి తర్వాత జేడీఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలను పార్టీలోకి చేర్చుకునే ప్రక్రియ అత్యంత రహస్యంగా సాగుతున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని వారం రోజులక్రిందటే కేంద్రమంత్రి, జేడీఎస్ కీలకనేత కుమారస్వామి అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం శాసనసభలో జేడీఎస్‌కు 18మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. 2023 ఎన్నికల్లో 19మంది గెలుపొందినా కుమారస్వామి ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రి కావడంతో చన్నపట్టణ స్థానాన్ని కోల్పోయారు. వీరిలో దాదాపు ఆరేడు నెలలుగా సీనియర్ నేత, మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ జీటీ దేవేగౌడ దూరంగా ఉన్నారు. ఇలా ఉండగానే కోలారు జిల్లా ముళబాగిలు ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్‌కు కాంగ్రెస్‌నుంచి ఆహ్వానం వచ్చింది. ఇదే విషయాన్ని మంజునాథ్ బుధవారం మీడియాకు తెలిపారు. కాంగ్రెస్‌లో ముఖ్యనేతలు ఆహ్వానించారన్నారు. ఇటీవలే జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నంజేగౌడ వ్యాఖ్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జిల్లాకు చెందిన జేడీఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించామని అయితే ఎటువంటి సమాధానం రాలేదన్నారు. దీన్నిబట్టి సమృద్ధి మంజునాథ్‌కు కాంగ్రెస్ కీలకనేతలే టచ్‌లో ఉన్నట్టు తేలిపోయింది. ఇదే పద్ధతిన పలువురిని ఆహ్వానించినట్టు తెలుస్తోంది. ఏకంగా పదిమందిని టార్గెట్ పెట్టినట్టు తెలుస్తోంది. భారీగా లాగేసుకుని జేడీఎస్‌ను నిర్వీర్యం చేయాలనేది వ్యూహంగా ఉన్నట్టు తెలుస్తోంది. తమ్ముడిని ఓడించిన ప్రతీకారం తీర్చుకునేందుకు డీకే శివకుమార్ పట్టుదలతో ఉన్నట్టు తెలుస్తోంది. మరో వారం పదిరోజులు ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది వేచి చూడాల్సి ఉంది.



లాల్‌బాగ్‌లో ప్రదర్శనకు సిద్ధంగా పూల మొక్కలు

నేటి నుంచి లాల్‌బాగ్‌లో పూలసోయగం

బెంగళూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యానవనం పూలసోయగానికి సిద్ధమైంది. ఏటా రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని వివిధ రూపాలతో ఆకర్షణీయంగా పూల ప్రదర్శన కొనసాగించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం రిపబ్లిక్ డే సందర్భంగా మహర్షి వాల్మీకి నమూనాతో భారీ పూల ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. గురువారం లాల్‌బాగ్ గ్లాస్‌హౌస్‌లో పూల ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించనున్నారు. పది అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో సర్వాంగ సుందరంగా వాల్మీకి విగ్రహాన్ని తీర్చిదిద్దారు. భారీస్థాయిలో పుట్టతోపాటు వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 60మంది నిపుణులైన కళాకారులు ఐదు రోజులుగా కార్యాచరణ చేస్తున్నారు. లక్షన్నర డచ్ గులాబీలు, 400 కిలోల ఫించ్ గులాబీ, 300 కిలోల హైదరాబాద్ చేమంతులతోపాటు వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా తీర్చారు. రిపబ్లిక్ డే దాకా ప్రదర్శనలు కొనసాగనున్నాయి. ఉద్యానవనాశాఖ మంత్రి మల్లికార్జున, రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డిలు ప్రదర్శనను ప్రారంభించనున్నారు.



గ్లాస్‌హౌస్‌లో మహర్షి వాల్మీకి నమూనా


భారత్ ఆర్థికంగా బలపడేందుకు యువత పాటుపడాలి

- కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

బెంగళూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రపంచదేశాల్లో ఎక్కువశాతం యువత భారత్‌లో ఉన్నారని విద్య, వ్యాపారం, పరిశోధనల ద్వారా దేశాన్ని ఆర్థికంగా శక్తివంతం చేసేందుకు యువత పాటుపడాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ అన్నారు. కర్ణాటకలోని శివమొగ్గ సహా గుజరాత్‌లోని రాష్ట్రీయ రక్షా విశ్వవిద్యాలయానికి సంబంధించి నాలుగో స్నాతకోత్సవం గుజరాత్‌లో జరిగింది. 447మందికి పట్టాలు ప్రదానం చేశారు. ఆర్‌ఆర్‌యూ కులపతి డాక్టర్ బిమల్ ఎన్ పటేల్ అధ్యక్షత వహించారు. కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ మాట్లాడుతూ.. జాతీయ రక్షణ దిశగా విశ్వవిద్యాలయాన్ని కొనసాగించడం సంతోషకరమన్నారు. వ్యాయామ శిక్షణ, సాంకేతిక పరిశోధనలు, డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ, నేవీ రంగాలకు దోహదపడేలా కోర్సులలో శిక్షణలు పొందారన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోదీ కొనసాగిన కాలంలోనే దూరదృష్టితో పరిశ్రమలకు ఉన్నతవిద్య అవసరమని గుర్తించారన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా సాంకేతిక ప్రయోజనాలు అందాలనే ఆలోచన సముచితమన్నారు. ఆర్‌ఆర్‌యూ చాన్స్‌లర్ బిమల్ పటేల్ మాట్లాడుతూ భద్రతా సిబ్బందికి ఆర్‌ఆర్‌యూ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రధానమంత్రి కార్యాలయంలోని జాతీయభద్రతా మండలి మంత్రిత్వ కార్యాలయం సహకారంతో జాతీయ సైబర్ భద్రత పర్యవేక్షణ అంశాన్ని ప్రస్తావించారు. క్రిమినల్ చట్టాలను పర్యవేక్షించే 1200మంది అధికారులకు యూనివర్సిటీలో శిక్షణలు ఇచ్చామన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్, యూజీసీల గుర్తింపు ఆర్‌ఆర్‌యూకు ఉందన్నారు. ఆర్‌ఆర్‌యూ తరహా శిక్షణలు ఇస్తున్న దేశంలో తొలిది కాగా ఆసియాఖండంలో నాల్గో స్థానంలో ఉందన్నారు. ఈమేరకు శివమొగ్గలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



స్నాతకోత్సవంలో పట్టా ప్రదానం చేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	162.72	1,583.01
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	8,270	0
నీటి నిల్వ (టీఎంసీలు)	75.58	10.22

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

కంప్లి, జనవరి 15 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో మాలధారులు ప్రత్యేక పూజలు జరిపారు. సంక్రాంతిని పురస్కరించుకుని మాలధారులు ఆలయంలో 18 మెట్లకు ప్రత్యేకాలంకరణ చేశారు. సంక్రాంతి రోజున ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అయ్యప్ప ఆలయంలో వివిధ ధార్మిక,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వివేకానందుడి ఆశయాలు అనుసరణీయం



మాట్లాడుతున్న ఈరేశ్ నాయక్

రాయచూరు జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దేశ ఔనత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానందుడి ఆశయాలు యువతకు అనుసరణీయయని జిల్లా క్రీడలు,యువజన సర్వీసుల శాఖ అధికారి ఈరేశ్ నాయక్ అన్నారు. స్వామి వివేకానంద 162వ జయంతిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ యువజనోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అతి పిన్న వయసులోనే దేశ ప్రతిష్ఠను ప్రపంచం నలుమూలలకు వ్యాప్తి చేసిన వివేకానందుడి ఆలోచనలు, దేశభక్తి నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

వరి ధాన్యం లారీ బోల్తా



బోల్తాపడిన లారీని బయటకు తీసిన దృశ్యం

బళ్లారి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బళ్లారి సమీపంలో గుగ్గరహట్టి వద్ద బళ్లారి-బెంగళూరు హైవేపై నిర్మించిన తుంగభద్ర అక్విడెంట్‌పై నుంచి వరిధాన్యం లారీ మంగళవారం బోల్తా పడింది. సిరుగుప్ప నుంచి 320 బస్తాల వరిధాన్యంతో బళ్లారిలోని ఇండస్ట్రియల్ వద్ద ఉన్న మిల్లుకు ధాన్యాన్ని తరలిస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. తుంగభద్ర కాలువలో 7 అడుగుల నీరు ప్రవహిస్తున్నాయి. లారీ బోల్తాపడడంతో ధాన్యం మొత్తం తడిసిపోయాయి. నీటిలో కొన్ని కొట్టుకుపోయాయి. ప్రొక్లైనర్ సాయంతో లారీని బయటకు తీశారు. రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు వ్యాపారి తెలిపారు.

రెండు లారీల ఢీ... డ్రైవర్, క్లీనర్లకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన లారీ

రాయచూరు జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా కసబా లింగసుగూరు-ముదగల్ రహదారిలో రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఒక లారీకి చెందిన డ్రైవర్ ముదగల్ నివాసి సయ్యద్ హుసేన్, క్లినర్ సైఫ్ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం లింగసుగూరు తాలూకా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన లింగసుగూరు పోలీసులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

సిద్దరామేశ్వరుని తత్వాలను అలవర్చుకోవాలి

● మేయర్ ముల్లంగి నందీష్

బళ్లారి సిటీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సిద్దరామేశ్వరుని తత్వాలను మనమంతా అలవర్చుకుందామని నగర మేయర్ ముల్లంగి నందీష్ అన్నారు. నగరంలోని జోళదాశి దొడ్డనగౌడ రంగమందిలో మంగళవారం జిల్లాపరిపాలన, జిల్లాపంచాయితీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మహానగర పాలికె ఆధ్వర్యంలో నిర్వహించిన శివయోగి సిద్దరామేశ్వర్ 853వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మేయర్ పూలమాలలువేసి నివాళులర్పించి మాట్లాడారు. సిద్దరామేశ్వరుని తత్వం మానవాళికి సేవ చేయడం, శివయోగ మార్గం, వచన సాహిత్యాన్ని విధ్వంసం నంచి కాపాడుటంలో సిద్దరామేశ్వర్ కూడా ఒకరని



కళాబృందాలతో సిద్దరామేశ్వర చిత్రపటం ఊరేగింపు



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మేయర్

అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మహమ్మద్ జుబేర్ మాట్లాడుతూ కుల, లింగ వివక్ష అనే సంప్రదాయాలను సిద్దరామేశ్వర్ తిరస్కరించారన్నారు. వ్యక్తిగత అనుభవం ద్వారా అక్షరాస్యతను నొక్కిచెప్పారు. సమసమాజనిర్మాణం కోసం తాను కలలు కన్నానని చెప్పారు. కార్యక్రమానికి ముందు శివయోగి సిద్దరామేశ్వర్ జయంతి సందర్భంగా నగరంలో సిద్దరామేశ్వర్ చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రమోద్, కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డా.హనుమంతప్ప, జిల్లా భోవి సంఘం అధ్యక్షుడు వి.రామాంజనేయులు, మహానగర పాలిక సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ సంఘాల పదాధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి: డీహెచ్ఓ

బళ్లారి సిటీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో పెద్ద ఎత్తున జరిగే జాతరులు, పండుగల సమయాల్లో ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డా.రమేశ్‌బాబు సూచించారు. బుధవారం బళ్లారి తాలూకాలోని కొర్లగుంది కుంభోత్సవం నేపథ్యంలో సందర్శించిన ఆయన వైద్యారోగ్యశాఖ ముందస్తు చర్యలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జాతరలు, గ్రామపండుగలు, మతపరమైన వేడుకల్లో ఎక్కువ మంది ప్రజలు గుమిగూడటంతో ప్రజలు స్వచ్ఛమైన నీటిని తాగాలన్నారు. ఆహారం తయారు చేసే ప్రదేశంలో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆయా గ్రామపంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు ఆహార వ్యర్థాలను సముచిత స్థలంలో పారవేసి పరిశుభ్రత పాటించేలా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. జిల్లా సర్వేయర్ డా.మరియండి మాట్లాడుతూ కలరా నియంత్రణ బృందం నీటి పరపరా వ్యవస్థవనరులు, నీటి నిల్వలు, పైపులు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నమూనాలను సేకరించి శుద్ధినీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు శుద్ధి చేసిన నీటినే తాగాలని అధికారి డా.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు, ఆరోగ్య అధికారులు

అబ్దుల్లా కోరారు. జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి వీరేంద్రకుమార్, వైద్యాధికారులు ఇర్ఫాన్, రాజశేఖర్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి దాసప్పనవర్, శాంతమ్మ, ముస్తాక్ అహ్మద్, ఈఓ షణ్ముకప్ప, నీలకంఠప్ప, మల్లికార్జున , మౌనిక, ముత్తమ్మ, సువర్ణ, అరుణజ్యోతి, ప్రజలు పాల్గొన్నారు.

ఆంధ్రుల గౌరవాన్ని నిలిపిన వీరాంజనేయులు



వీరాంజనేయులు, అరుణ దంపతులను సన్మానిస్తున్న తెలుగు సంఘం పదాధికారులు

సిరుగుప్ప, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత పదువులు దక్కించుకున్న ఘనత తెలుగువారిదేనని పీయూజీ ఛైర్మన్, ఫౌండర్ కొల్లి శ్రీనివాసరావు అన్నారు. సిరుగుప్పలో తెలుగు సంఘం ఆధ్వర్యంలో అమెరికాలో ఎస్‌యూజీ ఛైర్మన్ 2025 ఐటీ సర్వేగా ఎన్నికైన వల్లభనేని వీరాంజనేయులు, అరుణ దంపతులకు సంక్రాంతిని పురస్కరించుకుని సన్మానం చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సిరుగుప్ప తాలుకాలోని బెంచి క్యాంపులో ప్రాథమిక, హైస్కూలు, బళ్లారిలో పీయూసీ కళాశాల, గుల్బర్గాలో యూనివర్సిటీ చదివి అమెరికాలో నివాసం వుంటూ ఉన్నత పదవులు దక్కించుకునే స్థాయికి ఎదిగిన వీరాంజనేయులు తెలుగువారు కావడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. జనవరి 3న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సన్మానం పొందారు. సిరుగుప్ప తాలుకా తెలుగు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయనను సన్మానించారు. తెలుగు సంఘం ప్రముఖులు యార్లగడ్డ పిచ్చేశ్వరరావు, సత్యనారాయణ చౌదరి, కోనేరు గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి గోమాత శాపం తప్పదు

● సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

రాయచూరు జనవరి 15(ఆంధ్రజ్యోతి): గోమాత పొదుగును కత్తిరించి వికృత చర్యకు మద్దతునివ్వడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి ఆ గోమాత శాపం తప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ అన్నారు. గోమాతను హింసించిన వ్యక్తిని రక్షించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. గోమాత పొదుగును కత్తిరించి దుష్కర్యను నిరసిస్తూ బీజేపీ రైతు మోర్చా ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పెద్ద సంఖ్యలో తీసుకొచ్చిన గోవులతో ఆందోళన చేశారు. తొలుత బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం గోమాతలను తిరిగి గోశాలకు తరలించారు. ఆయన మాట్లాడుతూ దురుద్దేశపూర్వకంగా గోపొదుగును కత్తిరించిన వ్యక్తిని మతిస్తిమితం లేనివాడిగా చిత్రీకరించి ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం సిగ్గుచేటన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఇలాంటి దుష్కర్యలను ఏ పార్టీ ప్రభుత్వం ఉపేక్షించలేదని ఈ విషయంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన చర్య యావత్ జాతి తలవంచేదిగా ఉందన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుండడం దౌర్భాగ్యమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొల్కొని ఇలాంటి వారిని శిక్షించాలని లేదంటే ప్రజల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు.

19న బహుళ సాంస్కృతిక భారతోత్సవం

బళ్లారి సిటీ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని రక్షించేందుకు కర్ణాటక సౌహార్ద వేదిక ఆధ్వర్యంలో వివిధ సంఘాల సహకారంతో 19వ తేదీన మహత్వ సంస్కృతి భారతోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కర్ణాటక సమితి జిల్లా అధ్యక్షుడు సిరిగేరి పన్నరాజ్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఊరేగింపులు నిర్వహిస్తామని తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో 17 నుంచి మూడు రోజుల పాటు మేథోమదన సభ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సామరస్యం, సహజీవనమే తమ లక్ష్యమని అన్నారు. కలబురగి ఫెస్టివల్ సాకుతో దేశ అధ్యాత్మిక వారసత్వాన్ని ధ్వంసం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనికి పోటీగా కొందరు ఇతర ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతోన్మాదుల ఆకట్టుకునే మాటలకు మోసపోవద్దని యువతను కోరారు. 17న కలబురగిలోని శరణ్‌బసవేశ్వరాలయం నుంచి మహాత్మ బసవేశ్వర్, బాబాసాహెబ్ సర్కిల్ మార్గం నుంచి ఖ్వాజా బందెనవాజ్ దర్గా వరకు శరణు, సాధువు, సూఫీ చైతన్యం వైపు మన నడక అనే నినాదంతో సౌహార్ద యాత్ర సాగుతుందని అన్నారు. 18న గానగమల నినాదంతో రోజంతా సూఫీ పద, వచన గాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 19న 'బహుత్వ భారతీయ జాగృత అభియాన్'లో అన్నిమతాల నాయకులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, మానవ హక్కుల కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎ.మానయ్య, నిష్ఠి రుద్రప్ప, రమేశ్ బుజ్జీ, మంజునాథ్, రిజ్వాన్, రఫీ, గంగన్న పత్తార్, విజయ్‌కుమార్, జె.సత్యబాబు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

చెన్నేకొత్తపల్లి, జనవరి 15(ఆంధ్ర జ్యోతి): టీడీపీ కార్యకర్త వడ్డే జయరాంపై వైసీపీ వర్గీయులు బుధవారం దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. జయరాం కియా అనుబంధ పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా, వైసీపీ వర్గీయులు మాడెం ఓబిరెడ్డి, ఆయన తమ్ముడు మాడెం ప్రకాశ్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి మాట్లాడే పని ఉందని పాల డెయిరీ వద్దకు తీసుకువెళ్లి చితకబాదారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

నరహరితీర్థులకు ప్రత్యేక పూజలు



సుబుదేంద్రతీర్థులకు స్వాగతం పలుకుతున్న భక్తులు

కంప్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఆనెగొంది వద్ద నరహరి తీర్థ బృందావనం వద్ద మంత్రాలయం పీఠాదీశులు సుబుదేంద్రతీర్థులు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అంతకుముందు స్వామి రాకతో స్థానికులు, భక్తాదులు స్వామివారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామీజీ అక్కడ ఉపన్యాసం కూడా చేశారు. చుట్టుపక్కల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో వావిరాజు ఆచారి, భీమసేన ఆచారి, సుమంత కులకర్ణి, గురురాజు, దానాపురం శ్రీనివాస్, విజయ్, సంజీవ కులకర్ణి, విడపనూరు వెంకటేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంక్రాంతి స్నానాలు



హులిగి వద్ద తుంగభద్ర నదిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బళ్లారి గాంధీనగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కొప్పళ జిల్లా మునిరాబాద్ తాలూకాలో వెలసిన హులిగమ్మ దేవి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు సమీపంలోని తుంగభద్ర నదిలో మకర సంక్రాంతి స్నానాలు ఆచరించారు. మంగళవారం ఉదయం నుంచే వణుకు పట్టించే చలిని లెక్కచేయకుండా తుంగభద్ర నదీ స్నానాలు ఆచరించిన అనంతరం హులిగమ్మను దర్శించుకున్నారు. దేవి దర్శనం అనంతరం కుంకుమ, బండారు కొనుగోలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం గంగావతి, కుష్టిగి, కొప్పళ రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించింది. మకర సంక్రమణ సందర్భంగా మునిరాబాద్ సమీపంలోని శివపుర మార్కండేశ్వర దేవస్థానానికి వేలాది మంది భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

తమిళ సంఘం ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



క్రీడాకారులకు ఆర్థికసాయం అందిస్తున్న రూపనగుడి భోజరాజు, రామాంజిని

బళ్లారిరూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలో తమిళ సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రీడాపోటీలను నిర్వహించారు. క్రీడాపోటీలకు కర్ణాటక, ఆంధ్ర, సరిహద్దు ప్రాంతమైన రూపనగుడి గ్రామానికి చెందిన భోజరాజు, రామాంజిని, అంజి వీరి సహకారంతో గెలుపొందిన వారికి రూ.5 వేలు అందించారు.

సంక్రాంతి సంబరాలు



ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గులు

బళ్లారి సిటీ,జనవరి 15(ఆంధ్ర జ్యోతి): మూడు రోజుల సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. జిల్వావ్యాప్తంగా కన్నడ, తెలుగు ప్రజలు సంబరాల్లో మునిగిపోయారు. వేకువజామునే చలిమంటలు వేసుకుని సందడి కనిపించింది. మహిళలు ఇళ్ల ముంగిట అందమైన రంగువల్లులు వేశారు. స్నేహితులు,బంధువులతో ప్రతి ఇల్లూ కళకళలాడింది. సంక్రాంతికి ముందే పంట నూర్పిడిలు జరిగాయి. తుంగభద్ర ఆయకట్టుకింద వరి పంట విస్తారంగా సాగైంది. సద్దరొట్టెలు, పిండి వంటకాలతో పండగను సంబరంగా జరుపుకున్నారు. హరిదాసులు బసవన్నలతో ఇంటింటికి వచ్చి సందడి చేశారు. సుదూర ప్రాంతాల నుంచి బంధువులు రావడంతో లోగిళ్ల సంతోషాలతో నిండిపోయింది.

గవి సిద్దేశ్వర జాతరలో రొట్టెల పండుగ



రొట్టెలు తయారు చేస్తున్న మహిళలు

బళ్లారి గాంధీనగర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): గవిసిద్దేశ్వర జాతర మహోత్సవం అనంతరం 15 రోజుల పాటు నిర్వహించిన మహా అన్నదాసోహం కార్యక్రమంలో జొన్నరొట్టెల పండుగను నిర్వహించారు. ఇప్పటికే భక్తుల నుంచి 15 లక్షల వరకు జొన్నరొట్టెలు సేకరించగా, ఆలయ పరిసర ప్రాంతాల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు అక్కడికక్కడే కట్టెలతో మంటలు వేసుకుని రాత్రి పగులు లేకుండా రొట్టెలు కాలుస్తూ స్వామి వారికి రొట్టెల సేవలు అందిస్తుండడం విశేషం. రొట్టెలు తట్టేవారు చాలా వరకు వ్యవసాయ కూలీలే కావడం గమనార్హం. గవిమఠానికి వచ్చే భక్తుల అన్నదాసోహానికి ఈ రొట్టెలు అందిస్తారు. ఈ రొట్టెల తయారీ జాతర ప్రారంభానికి మునుపు 15 రోజుల ముందే రొట్టెలు తట్టే కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఈ సేవా కార్యక్రమంలో అన్ని జాతుల వారు పాల్గొంటారు. ఇంకా కొంతమంది భక్తులు ఇళ్లలోనే తయారు చేసుకుని ఊరేగింపుతో వచ్చి మఠానికి అందజేయడం ఆనవాయితీ.

సిద్దరామేశ్వర స్వామిని ఆదర్శంగా తీసుకోవాలి



సిద్దరామేశ్వర స్వామి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న భోవి సమాజ ప్రముఖులు

కంప్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): భోవి సమాజం పదాధికారులు సిద్దరామేశ్వరను ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ శివరాజు అన్నారు. పట్టణంలో బుధవారం సిద్దరామేశ్వర జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. భావచిత్ర పటానికి పూలమాలలతో ప్రత్యేక పూజలునిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన తత్వాలను అలవర్చుకోవాలన్నారు.

రాయచూరు: వచనకారుడు శివయోగి సిద్దరామేశ్వర జయంతిని బుధవారం తాలూకాలోని యరగుంట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. 12వ శతాబ్దానికి చెందిన వచనకారుడైన సిద్దరామేశ్వర జీవిత చరిత్ర నేటితరానికి ఆదర్శప్రాయమని గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు మహదేవప్ప కీర్తించారు.

హోసూరు జోన్

సంస్కృతిపై మక్కువ పెరగాలి

హోసూరు జనవరి 15(ఆంధ్రజ్యోతి): మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై యువతలో మక్కువ పెరగాలని హోసూరుకు చెందిన చిత్రకారుడు లూకాస్ అభిప్రాయపడ్డారు. తిరువళ్ళువర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం తన ఇంటిపై ప్రత్యేక నమూనాను రూపొందించారు. తమిళ సాహిత్యంలో మకుటమైన తిరువళ్ళువర్ సాధనలను తెలిపేలా 133 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రతిరోజూ 4 గంటలపాటు శ్రమించి మూడు నెలల్లో పూర్తి చేసినట్టు తెలిపారు. బెంగళూరు ఐటీ సంస్థలో పనిచేస్తున్నప్పటికీ కుటుంబంతో హోసూరులో ఉన్నట్టు తెలిపారు. తిరువళ్లువర్‌కు సంబంధించిన సాహితీ భాండారం తిరుకురల్‌ను 1330 ఐస్ పుల్లలతో రాసినట్టు తెలిపారు. 2022లో రంగురంగుల కాగితపు ముక్కలతో కరుణానిధి చిత్రాన్ని, ఇస్రోశాస్త్రవేత్త శివన్ చిత్రాన్ని రూపొందించి గిన్నిస్ రికార్డు సాధించినట్టు తెలిపారు. తాజాగా కన్యాకుమారి వద్ద సముద్రపు ఒడ్డున ఉండే తిరువళ్ళువర్ శిలా విగ్రహాన్ని ఇంటిపైకప్పుపై సిద్ధం చేశానని దీంతో మరోసారి గిన్నిస్‌రికార్డు సాధించాలనేది లక్ష్యమన్నారు.



ఇంటి పైకప్పుపై తిరువళ్లువర్ నమూనాతో యువకుడు



పోటీల్లో ఉరకలేస్తున్న ఎద్దులు

ఉత్సాహంగా కనుమ పండుగ

హోసూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపాన అంచెట్టి తాలూకా పరిధిలోని వన్నతిపట్టి గ్రామంలో కనుమ పండుగలో భాగంగా ఏర్పాటైన కార్యక్రమంలో 500 కు పైగా ఎద్దులు పాల్గొన్నాయి. తమిళనాడు నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఎద్దులు పాల్గొన్నాయి. ఎద్దుల పండుగను వీక్షించేందుకు వేలాది మందికి పైగా వీక్షించేందుకు తరలివచ్చారు. వేడుకల్లో ప్రమాదాలు జరగకుండా అంచెట్టి పోలీసులు బందోబస్తుల్లో నిమగ్నమైయ్యారు. కాగా కొంతమంది గాయపడగా వారిని వెంటనే అంబులెన్స్ ద్వారా అంచెట్టి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాలీబాల్‌లో అదరగొట్టిన హోసూరు బాలికలు

హోసూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రభుత్వ పాఠశాల బాలికలు వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిల్లో ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఈరోడ్‌లోని కళాశాల ఆఫ్ టెక్నాలజీలో రాష్ట్రస్థాయి పాఠశాలల మధ్య 19 ఏళ్లలోపు బాలబాలికల కోసం రెండు రోజులపాటు వివిధ పోటీలు నిర్వహించారు. బలికల ఫైనల్ మ్యాచ్‌లో హోసూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల జట్టు 22-25, 25-13, 25-22 పాయింట్ల తేడాతో సేలం ఓలి ఏజెన్సీ హైస్కూల్ జట్టుపై విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. విజేతగా నిలిచిన హోసూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గెలుపొందిన విద్యార్థినులను, కోచ్ మాణికవాసగంను ట్రోఫీలు, సర్టిఫికెట్లతో అభినందించారు.



ట్రోఫీతో విజేత జట్టు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

ఓపీ నయ్యర్ (జయంతి)



ఓంకార్ ప్రసాద్ (ఓపీ) నయ్యర్ 1926 జనవరి 16న లాహోర్‌లో జన్మించారు. సినీసంగీత దర్శకులు, గాయకుడు, గేయ రచయిత, స్వరకర్త. క్లాజికల్, మెలోడీలకు పెట్టింది పేరు. సినీప్రపంచానికి ఎంతోమంది గాయకులను పరిచయం చేశారు. ఆశా భోస్లే, మొహమ్మద్ రఫీ, గీతాదత్ వంటి గాయకులతో కలసి పనిచేశారు. 1958లో ఉత్తమ సంగీతదర్శకుడిగా ఫిల్మ్‌ఫేర్ పురస్కారం పొందారు. 2007 జనవరి 28న కన్నుమూశారు. ఆయన జ్ఞాపకార్థం పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

జైపాల్‌రెడ్డి (జయంతి)



ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన ఎస్ జైపాల్‌రెడ్డి 1942 జనవరి 16న తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా మాడుగులలో జన్మించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నికయ్యా రు. కాంగ్రెస్ పార్టీలో కీలకనేత. రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. చేవెళ్ళ మిర్యాలగూడ నియోజకవర్గాలనుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. కేంద్రంలో సమాచార, ప్రసారశాఖ, పెట్రోలియం, సహజవాయువు, భూవిజ్ఞానశాస్త్ర శాఖల మంత్రిగా వ్యవహరించారు. 2019 జూలై 28న కన్నుమూశారు.

శరత్‌చంద్ర ఛటర్జీ (వర్ధంతి)



ఛటర్జీగా గుర్తింపు పొందిన శరత్ చంద్ర ఛటోపాధ్యాయ 1876 సెప్టెంబరు 15న జన్మించారు. ఇరవయ్యో శతాబ్దపు బెంగాలీకి చెందిన ప్రముఖ నవలా రచయిత. ఆయన నవలలు తెలుగునాట ప్రభంజనంలా ప్రాచుర్యం పొందాయి. సమాజాన్ని, వ్యక్తినీ లోతుగా అధ్యయనం చేసి సృష్టించిన ఆయన పాత్రలు, నవలలు చిరస్థాయిగా నిలిచాయి. 'దేవదాసు' నవల బెంగాలీ, హిందీ, తెలుగుభాషలలో 16 వెర్షన్స్‌లో వచ్చి సంచలనం సృష్టించింది. ఇలా ఆయన రచనల ఆధారంగా సుమారు 50 సినిమాలు రూపొందాయి. 1938 జనవరి 16న కన్నుమూశారు.

మంత్రి జమీర్ వ్యాఖ్యలకు బీజేపీ నిరసన



గోమాతలతో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

బళ్లారి రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాయల్ సర్కిల్‌లో మంత్రి జమీర్ అహ్మద్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేపట్టారు. జమీర్ వ్యాఖ్యలను ఖండిస్తూ గోవులపై పలు అంశాలు మాట్లాడటంపై బుధవారం ఆందోళన చేశారు. ఇంకా సాయినాథ్ రెడ్డి, హనుమంతప్ప, రామచంద్రప్ప, కుమారస్వామి, శ్రీనివాస్ పాటిల్ పుష్పలత, పద్మావతి, హనుమంతప్ప, తిప్పన్న, మన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

హంపికు పోటెత్తిన పర్యాటకులు

కంప్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆంధ్ర, తెలంగాణరాష్ట్రాల్లోని భక్తాదులు హంపికి పోటెత్తారు. నదిలో పుణ్యస్నానాలు చేసి విరుపాక్షేశ్వర స్వామివారికి పార్వతిదేవికి మొక్కులు సమర్పించుకున్నారు. ప్రతి ఏటా నూతన సంవత్సరం మొదటి పండుగను పురస్కరించుకుని పలు పట్టణాల నుంచి పర్యాటకులు చేరుకుని హంపిని తిలకించారు.

అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం



అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సన్నదుర్గప్ప, బళే మల్లికార్జునను సన్మానిస్తున్న సభ్యులు

కంప్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దాపురం అగసి కృషి పత్తిన సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. 12 మంది సభ్యులు వుండగా అధ్యక్షస్థానానికి కట్టే సన్న దుర్గప్ప, ఉపాధ్యక్ష స్థానానికి బళే మల్లికార్జున నామినేషన్లు వేశారు. వారికి ఎవరూ పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎర్రిస్వామి తెలిపారు. అనంతరం వారికి పలువురు నాయకులు అభినందించి సన్మానించారు. కార్యదర్శి ఈరణ్ణ, వీఎల్ బాబు, సిద్దప్ప, బ్రహ్మయ్య, మూకయ్యస్వామి, గంగాధరగౌడ పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం



సోమప్ప చెరువు గట్టుపై పూజలు చేసిన దృశ్యాలు

కంప్లి, జనవరి 15(ఆంధ్ర జ్యోతి): కంప్లి నడిబొడ్డున ఉన్న సోమప్ప చెరువు గట్టుపై కొందరు క్షుద్ర పూజలు చేపట్టారు. ప్రతి అమావాస్య, పౌర్ణమిలకు రాత్రి సమయాల్లో క్షుద్రపూజలు చేపడుతున్నట్లు స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఆదివారం పౌర్ణమి కావడంతో ఉదయం సాయంత్రం వేళల్లో అక్కడ యోగా, ధ్యానం వెళ్లే వారుభయబ్రాంతులకు గురవుతున్నారు. పక్కనే సోమప్ప దేవాలయం వున్నా గట్టుపైన ఇలాంటి పూజలు జరుగుతుండటంపై ఆందోళన చెందుతున్నారు. పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వైభవంగా రామలింగేశ్వరస్వామి రథోత్సవం



పురవీధులలో రథోత్సవం

శిడ్లఘట్ట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నల్లరాళ్ళహళ్ళి రామలింగేశ్వర కొండపై కొలువైన రామలింగేశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే రవికుమార్, తహసీల్దారు బీఎన్ స్వామి ఉత్సవాన్ని లాంచనంగా ప్రారంభించారు. తొలుత మూల విరాట్టుకు, ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తికి ప్రాకారోత్సవం నిర్వహించిన అనంతరం అలంకరించిన రథంపై కొలువుదీర్చారు. అనంతరం భక్తులు జయజయధ్వానాల నడుమ రథోత్సవం సాగింది. పురవీధులలో రథంపై అరటిపండ్లు వేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరాముడు వనవాసకాలంలో ఇష్టలింగంగా ప్రతిష్టించిన రామలింగేశ్వర ఆలయంగా ప్రతీతి. రామాయణ కాలంనాటి ఆలయాన్ని చోళుల కాలంలో మరింతగా శిల్పకళతో తీర్చిదిద్దినట్టు చరిత్ర ద్వారా తెలుస్తోంది. రథోత్సవంలో వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేయడంతో చిన్నా పెద్దా ఉత్సాహంగా బొరుగులు, బత్తాసు, వివిధ రకాల తినుబండారాలు, ఆటబొమ్మలు కొనుగోలు చేశారు. ఉత్సవంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గౌడ, సునితా శ్రీనివాస్, తాదూరు రఘు, సీకల్ ఆనంద గౌడ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తాలూకా పంచాయతీ మాజీ అధ్యక్షుడు బీవీ నారాయణస్వామి, కమ్మదహళ్ళి సురేంద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

మేలూరులో సీతారాముల ఉత్సవం

తాలూకాలోని మేలూరు గ్రామంలో మకరసంక్రాంతిని పురస్కరించుకుని సీతారామలక్ష్మణ సమేత అంజనేయస్వామి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రీరామభజనమండలి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. శ్రీరామ నామ ధ్యానం, భజనల నడుమ పల్లకీఉత్సవం జరిగింది. ఉత్సవం నేపథ్యంలో ఇళ్లముంగి రంగురంగుల రంగవల్లులు వేశారు. చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఉత్సవంలో పాల్గొన్నారు. వందలాదిమంది భక్తులకు అన్నదాసోహం నిర్వహించారు. స్థానిక ప్రముఖులు నారాయణస్వామి, నాగరాజు, కేశవ, మంజునాథ, రవి, డమరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా సంక్రాంతి వేడుకలు

దొమ్మసంద్ర: ఆనేకల్ తాలూకాలో సంక్రాంతి వేడుకలు సంబరంగా సాగాయి. ఇందులో భాగంగా వర్తూరు తెలుగుసంఘం ఆధ్వర్యంలో గుంజూరు మనోహరరెడ్డికి చెందిన తోటలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించినట్టు సంఘం అధ్యక్షుడు శ్రీకృష్ణ తెలిపారు. కొత్త పంటలు చెరుకు, నువ్వులు, బెల్లం, అనప, వేరుశనగ, చిలగడదుంపలకు పూజలు చేశారు. గోపూజ నిర్వహించి ఇతర పశువులను అలంకరించారు. ఇదే సందర్భంగా రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందచేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహరరెడ్డి, విశ్వహిందూ పరిషత్ ప్రచారక్ మునిరాజు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



ఆటపాటల్లో పిల్లలు, పెద్దలు

అటవీ సిబ్బంది సేవలు ప్రశంసనీయం



అటవీసిబ్బందికి ఆత్మీయ సత్కారం

బంగారపేట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల దాడులనుంచి రైతుల పంటలను, గ్రామస్తుల ప్రాణాలను కాపాడడంలో కీలకబాధ్యతలు నిర్వహిస్తున్న అటవీసిబ్బంది సేవలను మరువరానివని గ్రామ ప్రముఖుడు గుల్లట్టి అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కదిరినట్ట గ్రామస్థులు, రైతుసంఘం ప్రముఖులు సంక్రాంతిని పురస్కరించుకుని అటవీసిబ్బందిని ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా గుల్లట్టి మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కించక రాత్రింబవళ్లు అటవీశాఖ సిబ్బంది శ్రమిస్తున్నారని వారి సేవలకు కృతజ్ఞతాభావంగా తమవంతు సన్మానం చేస్తున్నట్టు తెలిపారు. రైతుసంఘం తాలూకా అధ్యక్షుడు అప్పోజిరావ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సంక్రాంతి పండుగ ఆచరించడం సంప్రదాయమన్నారు. అటవీశాఖ అధికారి నాగేశ్ మాట్లాడుతూ రైతు సంఘం కార్యకర్తలు సంక్రాంతి పండుగ సందర్భంగా చేసిన సన్మానం వారి అభిమానానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ్, గిరీశ్, పుత్తేరి రాజు, హోబళి అధ్యక్షుడు మునికృష్ణ, లక్ష్మణ్, సంతోష్, గోవిందప్ప, రామోజిరావ్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



గోపూజలో నందీశ్‌రెడ్డి తదితరులు

మహదేవపుర, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆవుల పొదుగులను కోసేసిన దుండగులకు కఠిన శిక్ష విధించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని దొడ్డనెక్కుందిలోని స్వగృహంలో మకరసంక్రాంతిని పురస్కరించుకుని గోపూజ నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కన్నతల్లి అనంతరం జీవితాంతం ఆవుపాలను తాగుతూ ప్రజలు జీవనం సాగిస్తున్నారని ఇటువంటి తరుణంలో పాడి ఆవుల పొదుగులు కోసేసిన ఘటన కలచివేసిందని దుండగుల చేతులను తొలగించాలని డిమాండ్ చేశారు. సదరు వ్యక్తులను మానసిక అస్వస్థులుగా ప్రతిబింబించే యత్నం చేస్తోందన్నారు. కాగా బాధిత కుటుంబానికి మంత్రి జమీర్ మూడు ఆవులు ఇచ్చారని, అయితే గోమాతను వేధించిన బాధ అనుభవించడం ఎవరితరం కాదన్నారు. గోవులను బాధిం చిన దుండగులను కఠినంగా శిక్షించాలన్న తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాన న్నారు. అవసరమైతే చట్టపరంగా పోరాటం చేసేందుకు సిద్ధమన్నారు. కాగా పండుగలవేళ సంప్రదాయాలను పాటిద్దామని పిలుపునిచ్చారు.

విద్యార్థి సంఘాల ఆందోళన



డీవైఎస్‌పీకి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తోరణగల్లు, డిసెంబరు 15(ఆంధ్ర జ్యోతి): ఐదేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. సండూరు తాలుకా తోరణగల్లు గ్రామ పంచాయతీలో ఆయా సంఘాల పదాధికారులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తోరణగల్లు ప్రాంతంలో జార్ఖండ్ దంపతులకు చెందిన ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసిన నందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీవైఎస్పీ ప్రసాద్ గోకుల్‌కు, ఉప తహసీల్దార్ సుబ్బారావుకు వారు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో హెచ్ స్వామి, ఎస్ కాలుబా శివారెడ్డి, లోకేష్, అక్షయ, అర్జున్, యర్రిస్వామి, ఎంపీ తిమ్మప్ప, యాకూబ్, జయసూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ప్రాంతాల్లో ప్రమాదాలు

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెండు ప్రాంతాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన బోయ సంజీవప్ప(54), బోయ ఈరన్న ద్విచక్రవాహనంలో పెనుకొండకు వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి మట్టిదిమ్మెను ఢీకొట్టింది. దీంతో బోయ సంజీవప్ప తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ఈరన్నను పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు..

రొద్దం మండల కేంద్రానికి చెందిన చాంద్ బాషా, వంశీ ద్విచక్రవాహనంలో కర్ణాటకకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న బైకు మలుపువద్ద అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వంశీని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ ప్రమాదాలపై కేసులు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హుబ్బళ్ళిలో 45మంది రౌడీషీటర్లకు జిల్లా బహిష్కరణ

బెంగళూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళి - ధారవాడ పరిధిలోని 45మంది రౌడీషీటర్లను జిల్లా బహిష్కరణ చేస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ శశికుమార్ ప్రకటించారు. బుధవారం హుబ్బళ్ళిలో కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ జంటనగరాలలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇటీవల పలు గొడవలకు కారకులైన 45మంది రౌడీషీటర్లకు జిల్లా బహిష్కరణ చేశామన్నారు. వారిని బీదర్, యాదగిరి, తుమకూరు, దక్షిణకన్నడ జిల్లాల్లో ఉండేలా ఆదేశించామన్నారు. ధారవాడలోని శహర్ పోలీస్‌స్టేషన్‌లో ఏడుగురు, విద్యాగిరి పోలీస్‌స్టేషన్‌లో ఏడుగురు, ఉపనగర్‌లో ముగ్గురితో కలిపి రెండు నగరాలకు సంబంధించి 45మందిని నగర బహిష్కరణ చేశామన్నారు.

బైక్ ఢీకొని చిన్నారికి గాయాలు

అనంతపురం క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలో ద్విచక్రవాహనం ఢీకొని ఎనిమిదేళ్ల చిన్నారికి తీవ్రగాయాల య్యాయి. ఈ నెల 12వ తేదీ అనంతపురం రూరల్ మం డలం సోములదొడ్డి గ్రామానికి చెందిన చైత్ర అనే చిన్నారి తన ఇంటి ఎదుట ఆడుకుంటోంది. అదే సమయంలో సాయి అనే యువకుడు ద్విచక్రవాహంలో వెళ్తూ చైత్రను ఢీ కొన్నాడు. దీంతో చైత్ర తలకు తీవ్ర గాయం కావడంతో బెంగళూరుకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమాలను వీక్షిస్తున్న ప్రజలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను అలరించాయి. సంక్రాంతి పండుగ ను పురస్కరించుకుని శిల్పారామం ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం ధర్మవరానికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేత్ ఆధ్వర్యంలో నృత్య గురువు బాబు బాలాజీ శిష్య బృందం వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. వినాయక స్తుతి, లింగాష్టకం, కుంభజ్యోతి నాట్యం, కోలాటం, లంబాడి నాట్యం, సంక్రాంతి నృత్యం వంటివాటిని ప్రదర్శించారు. అదేవిధంగా బుధవా రం మైదుకూరుకు చెందిన ఇంద్రజాలికులు ఇంద్రజాల ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రామలాలిత్య, లీలమాధవి, ఇందు ప్రణీత, యశశ్రీ, రాజస్వి, అర్యన, దేవిసుత్తి, యశస్వినీ, లాస్య, హర్షిణి ప్రియ ముత్యభావన, ధ్రువశ్రీ, తన్విక, కీర్తన, మోక్షిత పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపీ పీసీ మోహన్ తదితరులు

భారీ హనుమ విగ్రహం ఆవిష్కరణ

బెంగళూరు మెట్రో, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామచైతన్యవర్ధిని సభా ట్రస్టు ఆధ్వర్యంలో 72 అడుగుల ఎత్తైన భారీ హనుమాన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన సర్వజ్ఞనగర్‌లోని కాచరకనహళ్ళి కోదండరామస్వామి ఆలయం ఆవరణలో బుధవారం ప్రతిష్ఠించారు. మంత్రులు కేజే జార్జ్, బైరతి సురేశ్, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్యే బైరతి బసవరాజ్, ధీరజ్ మునిరాజు, మాజీ ఎమ్మెల్యే అఖండ శ్రీనివాసమూర్తి తదితరులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీరామచైతన్య వర్ధిని ట్రస్టు అధ్యక్షుడు ఎంఎస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ రమేశ్‌గౌడ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సప్తగిరిగౌడ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి మూడు ఆవులు అందించిన మంత్రి



ఆవులను అప్పగిస్తున్న మంత్రి జమీర్ తదితరులు

బెంగళూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చామరాజపేట వినాయక నగర్‌లో మూడు ఆవులకు పొదుగులు కోయడంతో నష్టపోయిన పశువుల యజమానికి మంత్రి జమీర్‌అహ్మద్ హామీని నెరవేర్చారు. పశువుల యజమాని కర్ణ, అతడి తల్లి సవరి అమ్మళ్, సోదరి అముదాలకు మూడు ఆవులను బుధవారం అప్పగించారు. రూ.3లక్షల విలువైన మూడు ఆవులను సమకూర్చారు. సీఎం రాజకీయ కార్యదర్శి నజీర్ అహ్మద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మంగళముఖిలకు పోలీసుల హెచ్చరిక



మంగళముఖిలను హెచ్చరిస్తున్న ఎస్ఐ నాగమ్మ

బాగేపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భిక్షాటన నెపంతో దారిన వెళ్తున్న వారిని అడ్డగించి నగదు డిమాండ్ చేయడం, అశ్లీలంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో మంగళముఖిలను బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. పట్టణ శివారులోని బైపాస్‌రోడ్డులో పోతేపల్లి క్రాస్, దేవరగుడిపల్లి (గడిదం)లోని మెయిన్‌రోడ్డు హంప్‌ల వద్ద ద్విచక్ర వాహనాలను ఆపి ప్రయాణీకులను, విద్యార్థులను ఆపి బలవంతంగా డబ్బు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సోమవారం సాయంత్రం లెక్చరర్ కుమారుడు ద్విచక్రవాహనాన్ని ఆపి బలవంతంగా రూ.500 లాక్కున్నారని అనే అంశం సోషల్‌మీడియా వైరల్ అయ్యింది. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి జోక్యం చేసుకుని పోలీసుశాఖ సూచించడంతో సీఐ ప్రశాంత్ వర్ణి, మహిళా ఎస్ఐ నాగమ్మ, ఏఎస్ఐ నారాయణస్వామి స్పందించి పట్టణంలోని మంగళముఖిలను స్టేషన్‌కు రప్పించారు. ప్రజలను వేధించే తీరు మార్చుకోవాలని మంగళముఖిలను హెచ్చరించారు.

ప్రియురాలి ఫొటోలు షేర్ చేసి...

ప్రియుడి ఆత్మహత్య



సందేశ్ (ఫైల్)

బెంగళూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రియురాలి వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసిన అనంతరం ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హుబ్బళ్ళి పరిధిలోని హుణకల్‌లో చోటు చేసుకుంది. హుబ్బళ్ళి నవనగర్ నివాసి సందేశ్ హుణకల్ (27) ఆత్మహత్యకు పాల్ప డిన యువకుడు. సందేశ్ శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత కనిపించలేదు. ఆ తర్వాత చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న విషయం మంగళవారం వెలుగు లోకి వచ్చింది. సందేశ్ ఆత్మహత్యకు ముందు తల్లికి వాయిస్ మెసేజ్ పంపారు. ఆత్మహత్య చేసుకుంటున్నానని చావుకు సంజనా కారణమని మెసేజ్ చేశారు. ప్రియురాలి ప్రైవేట్ ఫోటోలు, వీడియోలను మిత్రుల తోపాటు సోషల్‌మీడియాలో షేర్ చేశాడు. సందేశ్ మోటర్‌బైక్ షోరూం లో పనిచేస్తుండేవాడు. ఈమేరకు నవనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గణతంత్ర వేడుకలకు జిల్లా అధికారుల బృందం

రాయచూరు జనవరి 15(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలల్లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని జిల్లా అధికారుల బృందం దక్కించుకుంది. ప్రత్యేక అవసరాలున్న జిల్లాగా గుర్తించిన రాయచూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పథకాల అమలులో ప్రతిభచూపిన అధికారులను గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు రావల్సిందిగా ఢిల్లీ నుంచి ఆహ్వానం అందినట్లు అధికారులు తెలిపారు. ఆహ్వానం అందినవారిలో జిల్లా పంచాయతీ ప్లానింగ్ అధికారి డాక్టర్ రోణి, సిరవార తాలూకా పశువైద్య అధికారి డాక్టర్ క్షేత్ర, శిక్షణాధికారి చంద్రశేఖర్ దొడ్డమని తాలూకా పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి శశిధర్ స్వామి ఉన్నారు. వీరు గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఆధ్వర్యంలో ఇచ్చే తేనీటి విందులో పాల్గొననున్నారు.